
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 21 జూలై 2025 | 5



పట్టించు.. కో(య)..రా! 7
నేడు విశ్వ కోయ (గోండి) భాషా దినోత్సవం
సాధారణ స్థాయిలో గోదావరి ప్రవాహం
దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల 7



సెంట్రల్ జైలు వద్ద వైసీపీ శ్రేణుల హంగామా.. పోలీస్ వాహనంలో ఎంపీ మిథున్‌రెడ్డి తరలింపు

# సెంట్రల్ జైల్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి

- లిక్కర్ స్కామ్‌లో ఏ4
- ఆగస్టు 1 వరకు రిమాండ్

రాజమహేంద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్ కేసులో ఏ4, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం రాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. విజయవాడ ఏసీబీ కోర్టు మిథున్‌రెడ్డికి ఆగస్టు 1వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో సిట్ టీమ్ డీజీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 8.38 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు.జక్కంపూడి గణేష్, కొందరు యువకులు వైసీపీ జెండాలతో వచ్చి సెంట్రల్ జైలు ఎదురుగా రోడ్డుపై సుమారు 2 గంటల పాటు బైఠాయించి హంగామా సృష్టిం చారు.పోలీసులు ముందుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయకపోవడంతో నేరుగా జైలు గేటు వరకూ వైసీపీ కార్యకర్తలు, నేతలు వచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమై సెంట్రల్ జైలు రోడ్ అటూ ఇటూ బ్లాక్ చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ మురళీకృష్ణ నాయకత్వంలో అడిషనల్ ఎస్పీలు సుబ్బరాజు, చెంచురెడ్డి, ముగ్గురు డీఎస్పీలు, పలువురు సీఐలు,ఎస్ ఐలు, సుమారు 60 మంది పోలీసులు అక్కడ మోహరించారు. నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. రోప్ పార్టీ వచ్చింది. సెంట్రల్ జైలు వద్ద సెక్షన్ 30 అమల్లో ఉందని.. రోడ్డుపై ఎవరూ ఉం డవద్దని హెచ్చ రించారు.ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్,అప్పిరెడ్డి సెంట్రల్ జైలు ప్రధాన గేట్ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ వారిద్దరినీ బయటకు పంపించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్,మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, గూడూరి శ్రీనివాస్ తదితరులు సెంట్రల్ జైలు వద్దకు వచ్చారు. ముందుగా పెద్ద హడా వుడి చేసిన వైసీపీ శ్రేణులు మిథున్ రెడ్డిని తీసుకొచ్చిన సమయంలో కిక్కురుమనకపోవడం గమనార్హం.జైలు అధికారులు వైసీపీ నేతలను ఎవరినీ లోపలకు అనుమతించలేదు.జైలు అధికారులు లాంచనాలు పూర్తిచేసి ఎంపీ మిథున్ రెడ్డిని సెంట్రల్ జైలు రిమాండ్‌లో ఉంచారు.

## పులస..అధరహో..



ఈ పులస బరువెంతో తెలుసా.. అక్షరాలా 1.8 గ్రాములు.. అంటే రెండు కిలోల లోపే.. ధర ఎంతో తెలుసా రూ.22 వేలు.. యానాంలో చిక్కింది. 7

## కోళ్లను మింగేసిన నల్లత్రాచు



నల్లత్రాచు పాము నాలుగు కోళ్లు మింగేసింది.. స్థానికులు గమనించి స్నేక్ స్నాచర్‌కు అప్పగించారు. 7

# దేవుడా.. చూస్తున్నా!



ఉమ్మడి జిల్లాలోని ఒక ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



## ఆలయాల భద్రతకు హైటెక్ నిఘా

- జిల్లాలో 1625 ఆలయాలు
- భద్రతకు సర్కారు ప్రణాళిక
- ఇప్పటికే 764 టెంపుల్స్‌లో నిఘా
- 861 ఆలయాల్లో ఏర్పాటుకు ప్లాన్
- రూ.2.27 కోట్లతో అంచనాలు
- ఆభరణాలకు బీమా తప్పనిసరి
- టెంపుల్ బాధ్యత ఈవోలదే

**నిన్నటి వరకూ ఆలయాల భద్రత దేవుడికెరుక. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో దాడులు జరగని ఆలయం లేదు.. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఆలయాల ధ్వంసం ఘటనలు జరుగుతూనే ఉండేవి.. ఎప్పుడు జరిగింది.. ఎలా జరిగిందనేది కనిపెట్టడం పోలీసులకు కత్తి మీద సాముగా ఉండేది.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చింది.. దేవుడి సమస్యకు దారి చూపింది.. భద్రత కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ప్రతి ఆలయంలో నిఘా పటిష్టం దిశగా చర్యలు చేపడుతోంది.**

కార్పొరేషన్(కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆలయాల భద్రత చర్యలను పరిశీలిస్తే అంతంతమాత్రంగానే ఉన్నాయి. ప్రధాన ఆలయాలతో పాటు, చిన్న ఆలయాల వద్ద ఇదే పరిస్థితి. పలు ఆలయాల్లో నిఘా వ్యవస్థ నిద్రరోతోంది. రాత్రివేళల్లో అయితే కనీస బందోబస్తు కూడా ఉండడంలేదు.ఈ మేరకు ప్రభుత్వం ఆలయాలపై దృష్టి పెట్టింది.ఆలయాల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసే దిశగా సీసీ కెమెరాలతో హైటెక్ భద్రత చర్యలు చేపడుతోంది. ఆలయాలపై విధ్వంస ఘటనలు, చోరీలు అరికట్టేందుకు ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆలయ పరిసరాల్లో కెమెరాలు బిగించడంతో పాటు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రభుత్వానికి నష్టం కలగకుండా, భక్తుల ఆస్తులను కాపాడేందుకు ఐటీ ఆధారిత భద్రతకు శ్రీకారం చుట్టారు.

### ఆభరణాలకు బీమా..

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో విలువైన వెండి, బంగారం,ఇతర ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు,అగ్నిప్రమాదాల కారణంగా బీమా అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో విలువైన ఆభరణాల న్ని బీమా చేయించాలని ఒక నిబంధన తెచ్చింది.ఈ మేరకు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారం ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. విలువైన వస్తువులకు బీమా చేయించడం ద్వారా నష్టాన్ని క్లైమ్ చేసుకుని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా భర్తీ చేయవచ్చు. ఉదాహరణకి గత వైసీపీ ప్రభుత్వంలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రథం కాలిపోయింది. అప్పటికే ఆలయ ఈవో ఆ రథానికి బీమా చేయించారు. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.98 లక్షలు రికవరీ అయింది. ఉమ్మడి జిల్లాలో 1,182 ఆలయాల్లో విలువైన నగలు ఉండగా 700 దేవస్థానాలకే బీమా చేయించి నట్టు తెలుస్తోంది. మిగిలిన ఆలయాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

### ఆలయాలు 1,625

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,625 ఆలయాలు ఉన్నాయి.వీటిలో 764 ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఉంది. మిగిలిన 861 ఆలయాలకు నిఘా వ్యవస్థ కొరవడింది. కాకినాడ జిల్లాలో 344 ఆలయాలకు 88 ఆలయాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.మిగిలిన 256 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.64 లక్షల ప్రతిపాదనలు చేశారు.తూర్పుగోదావరి జిల్లాలో 353 ఆలయాలు ఉన్నాయి. వీటిలో 230 ఆలయాల్లో సీసీ కెమెరా వ్యవస్థ ఉంది. మిగిలిన 123 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.42 లక్షలతో అంచనా ప్రతిపాదనలు చేశారు. కోనసీమ జిల్లాలో 928 ఆలయాలకు 446 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగిలిన 482 ఆలయాలకు రూ.1.21 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

### అవకతవకలకు అడ్డుకట్ట

పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు పటిష్టంగా పనిచేస్తుండడంతో హుండీ లెక్కింపుల్లోను పారదర్శకత పెరిగింది. చోరీలు, అవకతవకలకు అడ్డుకట్ట పడుతోంది. సెలవు రోజులు, బ్రహ్మోత్సవాలు, పండుగల వేళల్లో వేలాదిగా వచ్చే భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ఈ సాంకేతిక భద్రతా వ్యవస్థ కీలకంగా మారుతోంది. హుండీల లెక్కింపుల్లోనూ నిఘా వ్యవస్థ గట్టిగా పనిచేస్తోంది. ఆలయాలకు వచ్చే ఆభరణాల భద్రతకు నిఘా వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. అధికారులు పర్యవేక్షిస్తారు. ఇంత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉన్నప్పటికీ ఆలయాల్లో దొంగతనాలు దోపిడీలు జరిగితే వాటి పూర్తి బాధ్యత ఆలయ ఈవోలదే అని అధికారలు స్పష్టం చేశారు. సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత ఈవోలదేనని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు పనిచేయకపోతే వచ్చే పరిణామాలకు ఈవోలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మొబైల్ యాప్‌ల ద్వారా కెమెరాలను నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

### 861 ఆలయాలకు.. రూ. 2.27 కోట్లు



గతంలో ఆలయాల్లో జరిగిన దోపిడీ కేసుల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయి. అందుకే 861 ఆలయాల్లో రూ.2.27 కోట్లతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.ఆలయాల్లో ఆభరణాల బీమా బాధ్యత ఈవోలదే. సీసీ కెమెరా నిఘాలో ఏ విధమైన ఘటనలు జరిగినా బాధ్యత ఈవోలదే.
**-డీఎల్‌వీ రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్, దేవదాయ ధర్మదాయశాఖ**

## నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒకప్రకటన వెలువరించారు.అర్జీదారులు గమనించాలన్నారు.

## కాకినాడలో కార్డెన్ సెర్చ్

కాకినాడ క్రైం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్(సీఏఎస్‌వో) సెర్చ్‌లో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజాము 4గంటల నుంచి కాకినాడ పూలేపాకలు, టిడ్కో అపార్టుమెంట్ సముదాయం ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బైక్‌ల రికార్డులు పరిశీలించి రికార్డులు సక్రమంగా లేని 21మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పాత కేసుల్లో నేరస్తుడిగా ఉన్న ఓ నిందితుడిని పట్టుకున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నా, కొత్త వ్యక్తులు ఉంటున్నా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌డీపీవో పాటిల్‌దేవరాజ్ కోరారు. పోర్టు సీఐ సునీల్‌కుమార్, త్రీటౌన్ సీఐ కేవీ సత్యనారాయణ, పోర్టు, సర్పవరం ఎస్‌ఐలు సూర్యప్రకాశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాకినాడ రైల్వేలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**

కలెక్టరేట్(కాకినాడ), జూలై 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గంలో రైల్వేమౌలిక సదుపాయాల ఆధునికీకరణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్లఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖరాశారు. ప్రస్తుతం ఉన్న 125 కేవీ పవర్ సప్లయి వ్యవస్థ ప్రస్తుత అవసరాలకు సరిపోదని, దాన్ని 225 కేవీ సిస్టమ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల విద్యుత్తు ఇంజిన్లు, ఈఎంయూలకు నిరవధి కంగా విద్యుత్తు సరఫరా జరిగి వ్యవస్థ మరింతగా సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. ప్రస్తుత మౌలిక వసతులు హైస్పీడ్ రైళ్లకు అనువుగా లేవన్నారు. ప్రస్తుతం 130 కిలోమీటర్ల వేగంతో, భవిష్యత్తులో 160 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జిలు, యార్డులు, ట్రాక్‌ల సదుపాయాలు కల్పించాలన్నారు.



# నిర్వహణలో భేష్
# సేవల్లో కొరత

- కాకినాడలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం
- ప్రస్తుతం 50 పడకలకే వైద్యం పరిమితం
- ఈఎస్‌ఐ పరిధిలో 80 వేల మంది కార్మికులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కార్మికుల ఆరోగ్య భద్రత కోసం రూ.116 కోట్ల కేంద్రప్రభుత్వ నిధులతో కాకినాడలో నిర్మించిన వంద పడకల ఈఎస్ఐఎస్(కార్మిక రాజ్య బీమా సంస్థ ఆస్పత్రి)లో సేవలు పూర్తిస్థాయిలో అందడంలేదు. నిర్వహణ బాగానేఉన్నా సేవల్లోకొరత కనిపిస్తోంది. 2024, ఫిబ్రవరి 25న ఈ ఆస్పత్రి ప్రారంభమైనా, పలు వైద్యసేవలకు సంబంధించి అనేక సౌకర్యాలు కల్పించలేదు. 80వేల మంది కార్మికులు ఈ ఆస్పత్రిలో వివిధ రకాల వైద్య సేవలు పొందుతున్నారు.

### పలు విభాగాల్లో వైద్యుల కొరత

కీలకమైన గుండెవ్యాధులు, పల్మనాలజీ విభాగ వైద్యసేవలు మాత్రం ఇక్కడ అందడం లేదు. దీంతో వీటికోసం స్థానికంగా ఉన్న కార్పొరేట్ ఆస్పతులకు రిఫర్ చేస్తున్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల యంత్రాలు ఇంకా ఏర్పాటు కాలే దు. కొవిడ్ తర్వాత చాలామంది ఆరోగ్య విషయాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ అత్యంత అవసరమైన గుండెవ్యాధి వైద్యనిపుణులు లేరు. ఇది వందపడకల ఆస్పత్రి అని చెప్తున్నా.. ప్రస్తుతం మా త్రం 50 పడకల ఆసుపత్రిగా కొనసాగుతోంది. ప్రస్తుతం 38మంది వైద్యులు ఇక్కడ సేవలందిస్తున్నారు. పరిపాలనా విభాగంలో 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

### 24 గంటలూ వైద్యులు..

సువిశాలమైన ప్రాంగణంలో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నే రీతిలో భారీ భవంతిలో ఇక్కడ అత్యాధునిక వసతుల మధ్య వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. అవుట్ పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలతోపాటు ఇన్‌పేషెంట్ల కోసం ప్రత్యేకమైన గదులు ఇక్కడ సిద్ధంగా ఉన్నాయి. 24 గంటలూ ఇక్కడ వైద్యులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్, ఆర్థో, 24గంటల ఎమర్జెనీ వైద్యసేవలు, యూరాలజీ, గైనకాలజీ, చిల్డ్రన్, ఫిజియోథెరపీ, ఆప్తమాలజీ, డెంటల్ విభాగాల వైద్యపరీక్షలు చేస్తున్నారు. శస్త్రచికిత్స లు అవసరమైన వారికి ఆపరేషన్ థియేటర్స్ ఇక్కడే అందుబాటులో ఉన్నాయి.రోజుకు 500మంది ఓపీ చూస్తుండగా ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రోగులతో కిటకిటలాడుతోంది.

### వీరికి ఈఎస్ఐ సేవలు

ఏ ప్రైవేటు కంపెనీ/సంస్థలోనైనా పది మందికిపైగా పనిచేస్తే వారికి ఆ కంపెనీ/సంస్థ కచ్చితంగా కార్మికుల ఆరోగ్యభద్రతకోసం ఈఎస్ఐఎస్‌లో వారి పేర్లు నమోదు చేయించాలి. నెలనెలా కొంత మొత్తాన్ని చెల్లించాలి. ఇలా రూ.21వేలలోపు జీతం ఉన్న ప్రతి కార్మికుడు ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారందరికీ ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు అందుతాయి. కాకినాడ సాంబమూర్తినగర్‌లో నిర్మించిన ఈ ఎస్ఎస్ఐ ప్రధాన కార్యాలయానికి అనుసంధానంగా జిల్లాలోని పలు డిస్పెన్సరీలు కార్మికులకు వైద్యసేవలందిస్తున్నాయి. కాకినాడ రూరల్ మండలంలోని వలసపాకల, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, తుని, ద్రాక్షారామ, యానాం ఇలా పలుచోట్ల డిస్పెన్సరీలు ఉన్నాయి. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కలిపి 2,25,000మంది ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

### నిత్యం శుభ్రంగా..

సాధారణ జీజీహెచ్ ఆస్పత్రికి, ఈఎస్ఐ ఆస్పత్రికి నిర్వహణలో మాత్రం తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఆస్పత్రి ఆవరణతో పాటు ఇన్‌పేషెంట్ల రూమ్‌లను పరిశుభ్రమైన వాతావరణం ఉంచుతున్నారు. ఇందుకుగాను అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఆస్పత్రిలో 24 గంటలు కూడా భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. 30మంది వరకు వివిధ షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఈ ఆస్పత్రికి అన్నీ ఆదేశాలు ఢిల్లీ నుంచే అమలు చేస్తున్నారు.

## లిక్కర్ స్కామ్‌లో జగన్‌రెడ్డికి జైలు తప్పదు

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డికి రూ.3500కోట్ల లిక్కర్ స్కామ్‌లో జైలు తప్పదని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల ద్వారా మద్యాన్ని విక్రయించే పాలసీని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎంపీ మిధున్‌రెడ్డిని సిట్ అధికారులు విచారించి అరెస్టు చేయడడంతో జగన్ మేము ఏ తప్పూ చేయలేదంటుంటే గులికింతపూస మాట్లాడినట్లుగా ఉందన్నారు. ఆయన నేతృత్వంలోనే రూ.3500కోట్ల స్కామ్ జరిగిందని, ముఖ్యంగా మీ ఎంపీ విజయసాయిరెడ్డి మీలో మీ వాటాలు తేలక బయటపడ్డారని, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ స్కామ్‌లో ముఖ్య భూమిక వహించగా అప్పటి సీఎం జగన్ కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందన్నారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, సత్తి సదాశివరెడ్డి, కుంచే తాతాజీ, పారంశెట్టి నాగేశ్వరరావు, బద్ది సురేష్ పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూకేలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు



అతిథులు, యోగా శిక్షకులతో యోగాసన పోటీల విజేతలు

జేఎన్టీయూకే, జూలై 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యోగా హాల్లో కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, యోగాసనా భారత్, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ సహకారంతో కోకనాడ యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఆదివారం నిర్వహించినట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ చుంద్రు సుధాదేవి తెలిపారు. ఈ పోటీలు 10 నుంచి 55 ఏళ్ల వరకూ వివిధ కేటగిరీల్లో జరిగాయని, ఆరు విభాగాల్లో నిర్వహించే పోటీల్లో మొత్తం 100మందికి పైగా పురుష, మహిళ, బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి యోగాసన స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొని విజేతలకు బహుమతులు, పతకాలు, ప్రతిభా పత్రాలను అందజేశారు. ఈ పోటీల్లోని విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక తెలిపారు. కార్యక్రమంలో తలాటం హరీష్, రాజు, యాసిన్, గాయత్రి, లక్ష్మీ, సత్యనారాయణ, మూర్తి, రాజేష్ పాల్గొన్నారు.

## సరికొత్త కార్యరూపంలో..
## ఈవెంట్ మేనేజ్‌మెంట్

- రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్



కాకినాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సరికొత్త కార్యరూపంలోకి రానుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఏ కన్వెన్షన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కాకినాడ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం, ఈమా లైమ్‌లైట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డ్యాన్సర్లు, సౌండ్, లైటింగ్, ఎల్ఈడీ టెక్నీషియన్లు, తదితర నటులు, కళాకారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా ప్రకృతి సౌందర్యంతోపాటు ఎక్కువ సంఖ్యలో హోటల్స్, రిసార్ట్స్ గదులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ల ఏర్పాటు అవసరాన్ని వివరించారు. పీపీపీ విధానంలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధిలో భాగంగా సరికొత్త ఆలోచనలతో, సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ ద్వారా మరింత మంది పర్యాటకులను ఆకర్షించాలని తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించి తద్వారా పలు ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్తామన్నారు. ఈ మధ్య కాలంలోనే విశాఖపట్నం, విజయవాడల్లో టూరిజం కాన్‌క్లేవ్‌లు నిర్వహించామన్నారు. త్వరలోనే తిరుపతిలో ఇన్వెస్టర్ కాన్‌క్లేవ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సినీ రంగ నటీనటులు, కళాకారులు, కాకినాడ ఈవెంట్స్ మేనేజర్స్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.





నా తండ్రికి మెరుగైన వైద్యం అందట్లేదు 8
ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి
ఐసీయూ నుంచి బయటకు వచ్చి కన్నీటిపర్యంతం

'లోవ'లో భక్తుల కోలాహలం 7
సత్యదేవుడికి పట్టువస్త్రాలు

# బరువు 1.8 కిలోలు ధర రూ.22 వేలు

## యానాం మార్కెట్‌లో పులస



యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

యానాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు కిలో 800 గ్రాముల బరువు ఉన్న పులస చిక్కింది. దీనిని ఆదివారం యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.22వేలకు పాడి దక్కించుకున్నారు. గౌతమి గోదావరిలో ఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. వారం రోజుల క్రి తం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చి రూ.18వేల ధర పలికిన విషయం తెలిసిందే. అయితే రానున్న వరదకు మరిన్ని పులసలు దొరికే అవకాశం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు.

# రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో..

## సత్తెమ్మతల్లికి అలంకరణ



ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లిని రూ.20లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. గొలకోటి ఫణి, జీవీఎస్ బ్రహ్మానందం, గొలకోటి బాబి పులిహోర, అన్నవరం ప్రసాదం అమ్మవారికి సమర్పించి భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. వేముల వెంకన్నబాబు చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. గాలిదేవర రాధాకృష్ణ కుటుంబ సభ్యులు బూరెలను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.


# నాలుగు కోళ్లను మింగిన నల్ల తాచు



జనుపల్లిలో కోళ్లను మింగిన నల్లతాచును పట్టుకున్న గణేష్‌వర్మ

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనుపల్లి బాలయోగి ఘాట్ సమీపంలో మారిశెట్టి నాగభూషణం ఇంటి ఆవరణలో ఉన్న పాడుబడిన బాత్‌రూమ్‌లో ఉన్న నాలుగు కోడిపిల్లలను ఆరు అడుగుల నల్లతాచు ఆదివారం మింగేసింది. కోళ్లు చేస్తున్న శబ్దాన్ని గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లేసరికి కోళ్లు కనిపించకపోగా నల్లతాచు కదలలేని స్థితిలో ఉండడాన్ని గుర్తించారు. వెంటనే బాత్‌రూమ్‌కు గడియవేశారు. వెంటనే భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. కోళ్లను మింగిన తాచు కోడిపిల్లలను జీర్ణించుకోలేక ఒక్కొక్కటిగా ఆ బాత్‌రూమ్‌లోనే కక్కేసింది. అక్కడు చేరుకున్న వర్మ తాచు పామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాడు.

# వ్యంగ్య చిత్ర పోటీల్లో రాముకు బహుమతి




మాడా రాము గీసిన కార్టూన్



అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీమామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయస్థాయి వ్యంగ్య చిత్ర పోటీల్లో కోనసీమ జిల్లా బండారులంకకు చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. నెల్లూరులో విశాలాక్షి విరజల్లుల పేరిట ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో వ్యంగ్య చిత్రాల ప్రదర్శన నిర్వహించి అభినందించారు.



# వ్యక్తిపై ముగ్గురి దాడి

## అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యవహారంలో కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దోనిపాటి మహేష్‌పై రెండు పర్యాయాలు విచక్షణారహితంగా దాడి చేయడంతో గాయపడి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిచేసిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం.. అమలాపురం పురపాలక సంఘంలో గతంలో పనిచేసి ప్రస్తుతం తునిలో పనిచేస్తోన్న ఉదయశంకరం అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ నుంచి రూ.6.70లక్షలు వసూలు చేశాడు. పురపాలక సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఇప్పిస్తానని గత కొన్ని నెలలుగా నమ్మించాడు. ఈ వ్యవహారంలో మధ్య వర్తిత్వం వహించిన రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న దోనిపాటి మహేష్‌ను ఈనెల 19వ తేదీ రాత్రి 7.30గంటల సమయంలో యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ ఆటోలో ఎక్కించుకుని పేరూరు వై.జంక్షన్ నుంచి కామనగరువు సమీపంలోని కొబ్బరి తోటల్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. అక్కడి నుంచి అల్లవరం మండలం దేవర్లంక తీసుకెళ్లి అక్కడ మరోసారి దాడి చేశారు. గాయపడ్డ దోనిపాటి మహేష్‌ను బంధువులు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్, కృష్ణ, మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

## వివాహిత హత్య కేసును సుమోటాగా స్వీకరించిన మహిళా కమిషన్

అమలాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటాగా స్వీకరించింది. బి.సావరంలో ఓలేటి పుష్ప (22) షేక్ షమ్మా(22) అనే వ్యక్తితో సహజీవనం చేసింది. అయితే ఈనెల17న పుష్పను వ్యభిచారం చేయాలని షమ్మా పట్టుబట్టాడు. అందుకు పుష్ప ఒప్పుకోకపోవడంతో అతిదారుణంగా హతమార్చాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను 3 రోజుల్లో అందించాలని మహిళా కమిషన్ ఆదేశించింది. బాధిత మహిళా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది.

# పట్టించు కో(య)..రా!


కనుమరుగవుతున్న కోయ భాష

ఆందోళన చెందుతున్న ఆదివాసీ సంఘాలు

నేడు విశ్వ కోయ (గోండి) భాషా దినోత్సవం



చింతూరు మండలంలోని ఓ పాఠశాలలో ఆదివాసీ విద్యార్థులు (ఫైల్)



కోయ వాచక పుస్తకం



కోయ భాషలో రచించిన పద్యాల పుస్తకం

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

లిపి లేని భాషలు కాలక్రమంలో కనుమరగవుతున్నాయి. ఈ కోవలోకే కోయ భాష కూడా చేరుతుందన్న ఆందోళనను ఆదివాసీ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2018 జూలై 21న దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఆదివాసీ మేధావులు ఢిల్లీలో సమావేశమయ్యారు. కనుమరుగవుతున్న విశ్వ కోయ (గోండి) భాషలను సంరక్షించుకోవాలని తీర్మానించుకున్నారు. ఆ మేరకు ప్రతి ఏటా జూలై 21న విశ్వ కోయ (గోండి) భాషా దినోత్స వాన్ని జరుపుకోవాలని నిచ్చయించుకున్నారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో వ్యాప్తి చెంది ఉన్న ఆదివాసీలు వివిధ ఆదివాసీ సంఘాల నేతృత్వంలో విశ్వ కోయ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్ ప్రస్తుతం ఆదివాసీ సంఘాల నుంచి వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో దాదాపు 3 కోట్ల మంది ఆదివాసీలు ఉన్నట్టు అంచనా. ప్రాథమిక విద్య మాతృ భాషలోనే బోధించాల న్నది ఆదివాసీ మేధావుల అభిప్రాయంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రం నాటి కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో కొన్నేళ్లపాటు ఒకటి నుంచి 3 వరకు తరగతులు కోయ భాష లోనే బోధించారు. స్థానిక ఆదివాసీ యవతను ఉపాధ్యాయులుగా నియమించి గౌవరవేతనం చెల్లించేవారు. నాడు రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 920 ఆదివాసీ ప్రాంత పాఠశాలల్లో 18,795 మంది ఆదివాసీ విద్యార్థులకు ఈ తరహా బోధన జరిగింది. ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోయ భాష, కర్నూలు, అనంత పురం సుగాలి భాష, విశా ఖపట్నం జిల్లాలో కువి, కొండ భాష, శ్రీ కాకుళం, విజయనగరం జిల్లాల్లో సవర భాషలకు అనుగుణంగా కోయ భారతి పుస్తకాలను ముద్రించి బోధించారు. సహజంగా ఆదివాసీ చిన్నారులు వారి ఇళ్ల వద్ద మాతృ భాషలో మాట్లాడుతుంటారు. వారిని పాఠశాలల్లో చేర్పించి తెలుగు లేదా ఆయా రాష్ట్ర భాషల్లో బోధిస్తే పూర్తిగా అర్థంకాక చివరకు డ్రాప్ అవుట్స్ అవు తున్నారన్నది ఆదివాసీ సంఘాల వాదన. ఈ తరహా సమస్యను తొలగించాలంటే అంగన్‌వాడీ స్థాయి నుంచి మూడో తరగతి వరకు వారి మాతృ భాషలోనే బోధించాలని ఆదివాసీ మేధావులు అంటున్నారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో పడిన అడుగులు ఇప్పుడు మందగించాయన్న ఆరోపణ ఉంది.

# సత్యదేవుడికి పట్టువస్త్రాల సమర్పణ



ఆవిర్భావ దినోత్సవాలకు పట్టువసాతిలు అందుకుంటున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 25, 26 తేదీలలో జరిగే ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని స్వామి,అమ్మవార్లకు.. ఇతర ఉపాలయాల్లో కొలువైన అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను ఆదివారం విశాఖపట్నంకు చెందిన ఏ నాగేశ్వరావు అందజేయగా వాటిని ఆలయ ప్ర ధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యానికి ఈవో సుబ్బారావు దంపతులు అందించారు. కార్యక్రమంలో అర్చకులు సుధీర్ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

### లక్ష ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు తలుపులమ్మ లోవకు తరలివెళ్లారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం, తొలిపావంచా వద్ద ఉన్న ప్రసాదం కౌంటర్లలో కొనుగోలు చేశారు. ఆదివారం ఒక్కరోజు సుమారు లక్ష ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటి ద్వారా సుమారు రూ.20లక్షల ఆదాయం లభించింది.



సత్యదేవుడి ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

# విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ ప్రత్యేక పూజలు



అన్నవరంలో ఏడీకి వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు.

# 'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలి

## ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ సూచించారు. కోనసీమ జిల్లా అమలాపురం ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయం వద్ద ఆదివారం సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ తల్లికి వందనం తీసుకున్న తల్లులు ఎందరో తమ బిడ్డలను తీసుకుని రాజమార్గంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4600 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్మెంట్‌లో ఉండడం విచారకరమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 11వ పీఆర్సీ బకాయిలు, టీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్ లోన్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 12వ పీఆర్సీ వేసేందుకు జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు తక్షణం జాయింట్ యాక్షన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి రోడ్డు మ్యాప్ ఇవ్వాలన్నారు. యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులకు మోక్షం కల్పించాలన్నారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదె సత్యపల్లంరాజు తదితరులు ఉన్నారు.

# 'గృహ నిర్మాణ సంస్థ' అధ్యక్షుడిగా చక్రవర్తి

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ చక్రవర్తి నియమితులయ్యారు. ఆదివారం విజయవాడ యూటీఎఫ్ భవనంలో అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఎన్.మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణ హౌసింగ్ ఏఈ కేఎస్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీగా చిత్తూరుకు చెందిన ఎన్.శ్రీరాములురెడ్డి, కోశాధికారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతనకార్యవర్గంలో 26 జిల్లాలకు చెందిన వారికి చోటు కల్పించారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీ సభ్యులు

# దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

## కొంతమూరులో 18 కాసుల బంగారం, 3.5 కిలోల వెండి చోరీ



ఆధారాలు సేకరిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తు సామగ్రితో పాటుగా నగదును అపహరించుకుపోయారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన గరిమెల్ల పవన్‌కుమార్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15న శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం 20వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా తెరిచి ఉన్నాయి. బీరువాలో భద్రపర్చిన 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.5 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.10 వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పవన్‌కుమార్ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్. ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

## మూడున్నర కిలోల గంజాయి, 6 మోటారుసైకిళ్ల స్వాధీనం



గంజాయితో నిందితులను పట్టుకున్న పోలీసులు

కడియం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయం జరుగుతుందని డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్‌కు సమచారం రావడంతో ఎస్ఐ బీఎస్‌డీ దుర్గాప్రసాద్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. ఐదుగురు నిందితులు, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15వేల విలువైన మూ డున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజానగరం, రాజమ్మంగి, గండేపల్లి, తణుకు, బొ మ్మూరు, ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన 6 మోటారుసైకిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై జల్సా ఖర్చుల కోసం గంజాయి అమ్మకాలు, దొంగతనాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఐదుగురు ఏజెన్సీ ప్రాంతం కేడీ పేట గ్రామం నుంచి గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్లుగా తయారు చేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు.

# కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడిలో ఆదివారం కోడిపందేలపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1150 నగదు, 3 బైకులు, 2 కోళ్లు, 4 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

# పొట్ట కూటికి పాట్లు!



కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవలో పొట్ట కూటి కోసం శరీరమంతా రంగు వేసుకుని బొమ్మలుగా మారిన చిన్నారుల చిత్రాలే ఇవి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

# 'లోవ'లో భక్తుల కోలాహలం

## రూ.16.74 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటవార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి రూ.16.74 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

# పంట కాలువలో వృద్ధురాలి ఆత్మహత్య



అచ్చియ్యమ్మ మృతదేహం

రాయవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన కొండవిల్లి అచ్చియ్యమ్మ (70) బోదకాలు, ఆస్తమాతో బాధపడుతుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. రాయవరంలో ఉన్న కుమార్తె ఇంటి వద్ద నుంచి ఆదివారం ఉదయం లొల్లలో హోమియోపతి మందులు తెచ్చుకునేందుకు వెళ్తున్నట్టు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అచ్చియ్యమ్మ మండపేట- రామచంద్రపురం ప్రధాన కాలువలో మాచవరం వద్ద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలువలో వృద్ధురాలు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రాయవరం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఆధ్వర్యంలో కాలువలో మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి అల్లుడు మాడా ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

# దొరకని ఇంజనీరింగ్ విద్యార్థి ఆచూకీ

## గోదావరిలో కొనసాగుతోన్న గాలింపు చర్యలు



గౌతమి గోదావరిలో గాలింపు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఆత్రేయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి గోదావరిలో శనివారం ఉదయం స్నానమాచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) గల్లంతైన విషయం విదితమే. శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ బృందం 3 బృందాలుగా విడిపోయి గౌతమి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. ఖమ్మం నుంచి వచ్చిన బంధుమిత్రులు గోదావరి పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

# సాధారణ స్థాయిలో గోదావరి ప్రవాహం

## 49 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 49,422 క్యూసెక్కులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 12.70 అడుగులుగా నమోదైంది.

# మోతుగూడెంలో దర్శకుడు బోయపాటి సందర్శన

మోతుగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను పర్యటించారు. తన బృందంతో కలిసి అఖండ2 సినిమా చిత్రీకరణలో భాగంగా పొల్లూరు జలపాతం, ధారాలమ్మ గుడి వద్ద పిక్నిక్ స్పాట్‌తో పాటు కొన్ని ప్రదేశాలను సందర్శించారు.



పిక్నిక్ స్పాట్‌లో బృందంతో వెళ్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రవణం సుబ్రహ్మణ్యం



కొత్తపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లికి చెందిన రవణం సుబ్రహ్మణ్యాన్ని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తానని తెలియజేశారు.

## 'వైద్య ఉద్యోగులపై అదనపు భారం తగదు'



ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సుజాతతో చర్చిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

పిఠాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పనివేళలతో పాటు ఆన్ కాల్ డ్యూటీ పేరిట వైద్య ఉద్యోగులపై అదనపు పని భారం మోపడం తగదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్ వర్మ అన్నారు. పిఠాపురం సీహెచ్ సీ (ప్రభుత్వాసుపత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను సంఘం ప్రతినిధులు ఆదివారం కలిసి వైద్య ఉద్యోగులపై జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పారా మెడికల్ సిబ్బందికి ఆన్ కాల్ డ్యూటీ అలవెన్స్ ఇవ్వకుండా ఉత్తర్వులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గతంలో తక్కువ మంది రోగులు వచ్చే సమయంలో ఉన్న ఉద్యోగులే ఇప్పుడు పది రెట్లు రోగులు పెరిగినా ఉన్నారని తెలిపారు. అదనంగా వైద్యులు, సిబ్బంది నియమాకానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ శాఖ ఉద్యోగులకు ఇబ్బంది వచ్చినా తాము అండగా ఉండి పోరాడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి.రవికుమార్, కె.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలి'



ప్రమాణస్వీకారం చేస్తున్న మండల కమిటీ ప్రతినిధులు

సామర్లకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా కమిటీ, సామర్లకోట మండల, పట్టణ కమిటీల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లలితా ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యులు సేవా దృక్పథంతో ఐక్యతతో ఉండాలని సూచించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కుసుమంచి శేషగిరిరావు (బాబీ), ఉపాధ్యక్షుడిగా జొన్నాడ సందీప్‌కుమార్, కార్యదర్శిగా సంకా వీవీ. కామేశ్వరగుప్తా, సంయుక్త కార్యదర్శిగా బచ్చు వీవీఎల్ సోమేశ్వరరావు, కోశాధికారిగా పలుకూరి శ్రీనివాసు ప్రమాణం చేశారు. పట్టణ కమిటీ కార్యవర్గంగా ఏడుగురు ప్రతినిధులను ఎన్నుకున్నారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడు కుసుమంచి శేషగిరిరావుకు జిల్లా కార్యవర్గ సభ్యుడు కూరగాయల గొల్లబాబు శాలువా కప్పి సత్కరించారు. కటకం చిన వీర్రాజు, కటకం రత్నకుమారి, కంచర్ల నాగేశ్వరరావు, గ్రంధి వాసు, కటకం సత్యత్రిమూర్తులు, కూరగాయల అనిత, కుసుమంచి పావని, కుసుమంచి హరికృష్ణకుమార్, మట్టపల్లి శ్రీనివాసు, కడించెర్ల భాను, కాపుగంటి పైడిరత్నం, కంచర్ల జగన్నాథగుప్తా, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆంజనేయరెడ్డి సేవలు ప్రశంసనీయం'



ఆంజనేయరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా ప్రజల దాహార్తి తీరుస్తూ పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందిన అనపాల ఆంజనేయరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కాకినాడ దంటు కళా క్షేత్రంలో యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టారు) ఆధ్వర్యంలో ఆంజనేయరెడ్డిని ఘనంగా సత్కరించారు. చిరు వ్యాపారిగా ఉంటూ సంపాదించిన ఆదాయంలో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తూ ఆంజనేయరెడ్డి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

## కోరమండల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సర్పవరం జంక్షన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోరమండల్ ఫెర్టిలైజర్స్, కెమికల్స్ కంపెనీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పాతాళ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడ రూరల్ వాకలపూడి కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ఆవరణలోని దుర్గాదేవి గుడి వద్ద యూనియన్ సర్వసభ్యుల సమావేశం నిర్వహించారు. గత పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజు, ప్రధాన కార్యదర్శిగా వల్లు దుర్గాప్రసాద్, కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ, కోశాధికారిగా కె.లక్ష్మణరావు, ప్రచార కమిటీ కార్యదర్శిగా పి.రాజు, పలువురిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సభ్యుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానంటూ రెండో పర్యాయం తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు శ్రీనివాస రావు కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యులను యూనియన్ గౌరవ న్యాయ సలహాదారుడు, జనసేన నాయకుడు సలాది శ్రీనివాసబాబు అభినందించారు. వివిధ కార్మిక సంఘాలకు చెందిన సుమారు 500 మంది సభ్యులు పాల్గొన్నారు.



అలనాటి ఉపాధ్యాయులతో కలిసి 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

## విద్యార్థుల అ'పూర్వ' కలయిక

కరప, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో వున్న వారంతా మరలా కలుసుకున్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ఆటల పోటీలతో సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

## మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ అధ్యక్షుడు తడాల బుజ్జి ఆధ్వర్యంలో రోటరీ హాలులో ఆదివారం మూడవ వారాంతపు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, గౌరవ అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్-3020 గవర్నర్ డాక్టర్ ఏలూరి కల్యాణ చక్రవర్తి విచ్చేశారు. డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ చైర్మన్ తడాల వరప్రసాద్ బాబు ఆధ్వర్యంలో క్లబ్ ఆఫీసర్స్, బోర్డ్ మెంబర్స్ ఇన్‌స్టాలేషన్, పిన్నింగ్ కార్యక్రమాన్ని రోటరీ గవర్నర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద నిర్వహించారు. ఘట్టమనేని సితార పుట్టిన రోజు సందర్భంగా మహేష్‌బాబు ఫౌండేషన్ సమకూర్చిన సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్స్, నాలుగు కుట్టుమిషన్లు, పాఠశాలలకు క్రికెట్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి గోడి సత్య, ఆండాళ్ జయలక్ష్మి, నామన రమేష్, చోడవరపు మూర్తి, ముమ్మిడి సత్యనారాయణ, సూరన అంకుర్, గమిని మూర్తి పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి: దవులూరి దొరబాబు

సామర్లకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ఏడాది కాలంగా ప్రజలు మోసపోతున్న తీరుపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడం ద్వారా ఎండగట్టాలని వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కోరారు. మండలంలోని వెంకటకృష్ణరాయపురంలో వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు తలారి దొరబాబు అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరిట సమావేశం నిర్వహించారు. సామర్లకోట, పెద్దాపురం మండలాలు, పట్టణాలకు చెంది నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





గొల్లప్రోలులో బోనాలును ఊరేగింపుగా తీసుకొచ్చి పాదాంబిక అమ్మవారి ఆలయంలో సమర్పిస్తున్న మహిళలు

## పాదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పణ



గొల్లప్రోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు గ్రామ దేవతగా విరాజిల్లుతూ అందరి ఇంటి ఆడపడుచుగా పూజలు అందుకుంటున్న పాదాంబిక (పాదాలమ్మ) అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. ఆదివారం బోనాలును శిరస్సున పెట్టుకుని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుతూ బోనాలు పండుగ జరిపారు. అన్నం, ఇతర పదార్థాలను ఉంచిన బోనాలకు పసుపు, కుంకుమతో అలంకరించి వేప కొమ్మలు, మామిడాకులు కట్టి దానిపై దీపం ఉంచి తలపై పెట్టుకుని ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి బోనాలు, సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు, ఇతర సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఏడాదిలోనే ఎన్నో సేవా కార్యక్రమాలు

'యంగ్ మైండ్స్' ప్రథమ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, గాదె శ్రీనివాసులనాయుడు

కాకినాడ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ యువతలో స్ఫూర్తి నింపేందుకు యంగ్ మైండ్స్ సంస్థను స్థాపించి ఏడాదిలోనే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన వాకాడ వెంకటరమణ ఆదర్శనీయుడని ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఆదివారం యంగ్ మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. వెంకటరమణ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీలు పేరాబత్తుల, గాదె ముఖ్య అతిథులుగా, టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ విశిష్ట అతిథిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీవై దాసు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. దేశ సరిహద్దుల్లో విశేష సేవలందించిన ఆర్మీ జవాన్లు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురు ప్రముఖులను అతిథులు సత్కరించారు. పలువురు వికలాంగ పేద విద్యార్థులకు ట్రై సైకిళ్లు, సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు, పారిశుధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు అందజేసి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో చక్రధర్, శ్రీవిజయ్, ఎంఈవో కృష్ణవేణి, సూర్య ఐ కేర్ సీఈవో రామ్‌ప్రకాష్, పీఆర్టీయూ నాయకులు తిలక్ బాబు, కృష్ణకుమార్, రాజారావు, క్యాపిటల్ ఆసుపత్రి అధినేత మూర్తి, వైద్యులు నితిన్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ప్రథమ వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీలు రాజశేఖరం, శ్రీనివాసులనాయుడు

## అగ్నిప్రమాద బాధితులకు సాయం

పిఠాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం కావడంతో ఆటో డ్రైవర్ కొల్లి సత్యనారాయణ సర్వసం కోల్పోయాడు. ఆదివారం అతడి కుటుంబ సభ్యులను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పరామర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన రూ.10వేలు ఆర్థిక సహాయం, జనసైనికులు సమకూర్చిన రూ.20వేలు విలువైన బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట గిన్నెలు, దుస్తులను అందజేశారు. వారు ఉండేందుకు తక్షణం రేకులషెడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

### మురుగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం

పిఠాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు కొండప్ప వీధిలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిలోంచే విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోందని కౌన్సిలర్, తెలుగు మహిళ పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షురాలు పంపనబోయిన అన్నపూర్ణ కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో పోలీసు బందోబస్తు నడుమ మురుగునీరు పోయేందుకు వీలుగా తాత్కాలికంగా కాలువ తవ్వారు. పనులను మునిసిపల్ కమిషనరు కనకారావు పర్యవేక్షించారు.

### ప్రజలకు సంపూర్ణ సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంపూర్ణ సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని సిరివాడ, ఉలిమేశ్వరం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ మండల అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, ఎలిశెట్టి నాని, కూటమి నేతలు పాల్గొన్నారు.

### 2వ డివిజన్‌లో పర్యటన

సర్పవరం జంక్షన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాజీ డిప్యూటీ మేయర్ కాలా సత్తిబాబు ఆధ్వర్యంలో 2వ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ములసా బాబూరావు, పెంకే సత్యనారాయణ, కొండల సింహాద్రి, చోడవరపు సత్యనారాయణ, పుల్లల శ్రీనివాస్, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ పాలకవర్గాల ప్రమాణస్వీకారం

పెద్దాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్) ఆర్థిక పరిపుష్టికి పర్సన్ ఇన్‌చార్జిలు కృషి చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కోరారు. మండలంలోని ఆర్‌బీ పట్నం పీఏసీఎస్ చైర్మన్ పెనుమర్తి దొర బాబు ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా మెరుగైన సేవలందించాలని, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ నేతలు రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

**కాజులూరు (కరప) (ఆంధ్రజ్యోతి):** కాజులూరు మండలం పెనుమళ్ల పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం జరిగింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సొసైటీ చైర్మన్ కొల్లు వెంకటేశ్వరరావు, సభ్యులు బొక్కా అప్పన్న, కోన సుబ్రహ్మణ్యంలతో సీఈవో ప్రమాణం చేయించారు. నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, కూటమి నాయకులు చింతపల్లి వీరభద్రరావు, పెంకే సాంబశివరావు, చవ్వాకుల నారాయణమూర్తి, పేపకాయల బాబీ, వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి పాల్గొన్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** సామర్లకోట పీఏసీఎస్ చైర్మన్‌గా పైండి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు సభ్యులు ఆదపురెడ్డి కృష్ణారావు, తుమ్మల శ్రీనులతో సీఈవో కోరాడ బుజ్జి ప్రమాణం చేయించారు. వారిని టీడీపీ నేతలు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), గోలి సత్తిరాజు, మలిరెడ్డి వెంకటరత్నం, సానిపిని హరిబాబు, సోమేశ్వరరావు సత్కరించారు.

## నా తండ్రికి మెరుగైన వైద్యం అందట్లేదు

హెల్త్ బులిటిన్ ఎందుకు విడుదల చేయట్లేదు: ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి

సామర్లకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'నా తండ్రికి క్యాన్సర్ వ్యాధి ఉందని రెండు నెలల క్రితమే బహిర్గతం చేశాను. ఆయన నాపై ఆగ్రహం వ్యక్తం చేసి నా చేయి చేయిపట్టుకుని వారిస్తున్నారు. వైద్యులతో హెల్త్ బులిటెన్ ఎందుకు విడదల చేయించట్లేదు' అని కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె, జనసేన వీరమహిళ నాయకురాలు బార్లపూడి క్రాంతి ప్రశ్నించారు. తన తండ్రికి వైద్యం అందిస్తున్న ఏడీబీ రోడ్డు కొప్పవరం మెడికవర్ ఆసుపత్రికి ఆదివారం రాత్రి ఆమె రెండోసారి విచ్చేశారు. వైద్యంపై ఇంత గోప్యం ఎందుకు మెయింటైన్ చేస్తున్నారో అర్థం కావట్లేదని విలేకరుల ఎదుట వాపోయారు. ఐసీయూ నుంచి బయటకు వచ్చిన ఆమె కన్నీటిపర్యం తమయ్యారు. క్రాంతి విలేకరులతో మాట్లాడు తూ తన తండ్రికి సరైన వైద్యం అందట్లేద న్నారు. వైద్యం చేస్తున్న సమయంలో హెల్త్ బు లెటిన్ ఎందుకు విడుదల చేయట్లేదని ఆసుపత్రి యాజమాన్యాన్ని నిలదీశారు. ఆయనకు క్యాన్సర్ ఉంది. దానికి చికిత్స నిర్వహించకుండా డయా లసిస్ చేస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నించా రు. వాస్తవాలు చెప్తుంటే తనను మాట్లాడ కుం డా నిరోధిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నార న్నారు. ఇప్పటివరకూ కాకినాడలోని మూడు ఆసుపత్రులు తిప్పారని, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఎందుకు తీసుకెళ్లట్లేదని ప్రశ్నించారు. కావాలనే ఆసుపత్రి సెక్యూరిటీతో తనను అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. తన తండ్రికి మెరుగైన చికిత్స అందించి కోలుకునే వరకు వైద్యులు నిరంతరం హెల్త్ బులెటిన్లు విడుదల చేయాలని క్రాంతి డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్యే చినరాజప్ప పరామర్శ

మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ పద్మనాభాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## 'కాలువ గట్టుపై డంపింగ్ యార్డు తొలగించాలి'

సర్పవరం జంక్షన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని తోతట్టు ప్రాంతాలను వరద ముంపు బారి నుంచి కాపాడేందుకు పేట కాలువ గట్టుపై పేరుకుపోయిన డంపింగ్, ప్లాస్టిక్ వ్యర్థాలను తక్షణం తొలగించాలని ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గ్రామస్తులతో కలిసి రమణయ్యపేట కాలువ గట్టును ఆనుకుని ప్రధాన డ్రైన్‌పై వేసిన డంపింగ్, ప్లాస్టిక్ వ్యర్థా లను పరిశీలించారు. మురుగునీటిపారుదలకు వీలుగా మున్సిపాలిటీకి చెందిన చెత్తా, వ్యర్థాల ను ఇక్కడ వేయకుండా ఎమ్మెల్యే నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవంతినగర్, మారుతీనగర్, రేపాక గార్డెన్స్‌కు చెందిన కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### 'జీవనదానం' పుస్తకావిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి): హ్యూమనిస్టు, నేత్రదానం, రక్తదానం పుస్తకాల రచయిత పెన్మెత్స సుబ్బరాజు రచించిన 'జీవనదానం' పుస్తక ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. అమ్మ ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభకు అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం అధ్యక్షత వహించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కాకినాడకు చెందిన ఎయిడ్స్ వైద్య నిపుణుడు, అంటువ్యాధుల కన్సల్టెంట్ డాక్టర్ యనమదల మురళీకృష్ణ మాట్లాడుతూ అవయవదానంతో రోగుల జీవితాల్లో కొత్త జీవం వస్తుందన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యంతో ఆ వ్యక్తులు దాదాపు సాధారణ జీవితాన్ని గడపగలరన్నారు. పుస్తక రచయిత సుబ్బరాజు మాట్లాడుతూ 'జీవనదానం' పుస్తకం చదవడం ద్వారా దాదాపు అన్ని అవయవమార్పిడిలకు సంబంధించిన చారిత్రక, శాస్త్రీయ విషయాలు తెలుస్తాయని తెలిపారు.

### సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



కొత్తపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడి కృత్తిక సందర్భంగా మండలంలోని కొమరగిరి విశ్వేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ఆదివారం పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణ స్వామిని విశేషంగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.



## కొంగోడు గ్రామ దేవత ధనమహాలక్ష్మికి సారె సమర్పణ

కరప, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొంగోడు గ్రామదేవత ధనమహాలక్ష్మి అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ఆషాఢ మాస సారె సమర్పించారు. పలు రకాల పిండి వంటలు, పప్పు, చలివిడి, పానకం, చీరలు, మిఠాయిలకు పలు రకాల సజ్జలతో గ్రామోత్సవం చేసి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ నక్కా బాబులు, పెద్దలు మేశెట్టి సుబ్బారాజు, అట్ల గోవిందరాజులు, వీఆర్వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పీజీఆర్ఎస్ రద్దు

పిఠాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు ఏపీడీ వసంతమాధవి తెలిపారు. ఈ విషయాన్ని అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజలు గమనించాలని సూచించారు.

### వైద్య విద్యార్థులకు కళా పోటీలు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వచ్చే నెలలో నిర్వహించనున్న 67వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి సారథ్యంలో జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్, కల్చరల్ సెక్రటరీ డాక్టర్ కె.శైలజ ఆధ్వర్యంలో కళా పోటీలు నిర్వహించారు. 35 మందికి పైగా యూజీ, పీజీ విద్యార్థులు వివిధ రకాల చిత్రాలు వేశారు. చిత్రలేఖనం, టీషర్ట్ పెయింటింగ్, సబ్బులు, వ్యర్థాలు ఉపయోగించి తయారు చేసిన కళారూపాలు అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలను వార్షికోత్సవ వేడుకల్లో ప్రకటించనున్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ శైలజను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ అభినందించారు.



పోటీలను ప్రారంభిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

## టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

పెదపూడి (కరప), జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం గొల్లల మామిడాడ జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ క్లబ్ ఆవరణలోని ద్వారంపూడి దివాకర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నల్లమిల్లి మూలారెడ్డి మెమోరియల్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన కొద్దిసేపు క్రీడాకారులతో టెన్నిస్ ఆడారు. పెదపూడి, గొల్లలమామిడాడ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### 'దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి'

పిఠాపురం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం నవఖండ్రవాడలో దళితులకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని పీవీ రావు మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగు నూకరాజు డిమాండ్ చేశారు. మాలమహానాడు నాయకులు ఆదివారం గ్రామంలో పర్యటించారు. దళితులు శ్మశానవాటికకు వినియోగిస్తున్న స్థలం పీడబ్ల్యూడీ కాలువ గట్టు అని తెలిపారు. దీనిని కొందరు ఆలయ భూములుగా చిత్రీకరించి తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల రాంజీకుమార్, సహాయ కార్యదర్శి మహేంద్రవాడ సింహాచలం, బత్తిన శామ్యూల్, బళ్ల రజనీసురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పీజీఆర్ఎస్ రద్దు

పిఠాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు ఏపీడీ వసంతమాధవి తెలిపారు. ఈ విషయాన్ని అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజలు గమనించాలని సూచించారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## ఘాటీలో రాకపోకలకు అంతరాయం



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

మోతుగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం చింతూరు మారేడుమిల్లి ఘాటీ రోడ్లో శుక్రవారం సాంకేతిక లోపాలతో లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చత్తీస్‌ఘడ్ నుంచి మారేడుమిల్లి వైపు లోడుతో వస్తున్న లారీ గుంజుమామిడి వలస పంచాయతీ పాలమూరు ఘాటీ రోడ్‌లో వాలి సుగ్రీవుడు బొమ్మల మలుపులో సాంకేతిక లోపాలతో నిలిచిపోయింది. దీని ప్రక్కన కొంత ఖాళీ స్థలం ఉండడంతో చిన్న వాహనాలు వెళ్లడానికి ఆస్కారం ఉండేది. వెనుక వచ్చిన మరో లారీ ప్రక్కగా వెళ్లేందుకు ప్రయత్నించగా చక్రాలు మట్టిలో కూరుకుపోయాయి. ఫలితంగా ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో ఆర్టీసీ బస్సులు, లారీలను చింతూరు మారేడుమిల్లిలోను నిలిపివేశారు.ఇరువైపులా వాహనాలు బారులుతీరాయి. ఆదివారం ఇదేసమస్య కొనసాగుతోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు.

## అక్రమ కట్టడాల కూల్చివేతపై జాప్యం ఎందుకు ?

చింతూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): చింతూరు, ఎర్రం పేటలలో అక్రమ కట్టడాలపై నోటీసులు ఇచ్చిన అధికారులు కూల్చివేత విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నా రని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ప్రశ్నించారు. ఆదివారం ముకునూరులో సంఘం ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడారు. ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించి గిరిజనేతరులు కట్టడాలు చేప ట్టిన విషయం స్పష్టమైనప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు చూపుతున్న అలస్యం వెనుక ఉన్న మతలబు ఏమిటన్నారు. అక్రమ కట్టడాలు కూల్చివేసేంత వరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పూజారి పుల్లయ్య, సర్పంచ్ బీరబోయిన సత్యకుమారి, సన్యాసిరావు, లక్ష్మణరావు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

కూనవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):మండలం అయ్యవారిగూడెం గ్రామంలో ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. చింతూరు ఐటీడీఏ నిధులతో ఈఆర్‌వో ప్లాంట్ ప్రారంభించారు. ఇటీవల గ్రామస్థులు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఈ నీళ్ల తాగటం వలన కిడ్నీలు పాడవుతున్నాయని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వెంటనే నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎడవల్లి భస్కరరావు, టీడీపీ మాజీ మండల ప్రెసిడెంట్ ప్రేమ్ చంద్, చలకాని ఉమామహేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు దాసరి నరేంద్ర పాల్గొన్నారు.

## తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

కూనవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):మండలంలో జగ్గంపేట క్రాస్‌రోడ్‌లో ఏటపాక సీఐ కన్నపరాజు వాహ న తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, హెల్మెట్ లేని వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ప్రతీఒక్కరూ కూడా లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినంగా చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ జి.దివ్య, కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ



చింతూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పుట్టినరోజు ను చింతూరు టీడీపీ మండల శాఖ ఘనంగా జరుపుకుంది. ఆది వారం మారుమూలలో ఉన్న కొండరెడ్డి గ్రామమైన ఎర్రగొండ పాకలలో నాయకులు కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంచారు. అనంతరం ఆయా కుటుంబాలకు దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులునేని నర్సింహారావు, నాయకులు పొదిలి రామారావు, ముత్యాల శ్రీరాం, శీలం తమ్మయ్య, పల్లాల రమణారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

**వీఆర్‌పురం:** రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి పుట్టిన రోజు వేడుకలు మండల తెలుగుదేశం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధి రేఖపల్లి గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామా రావు, రాష్ట్ర నాయకులు బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్దార్థ, బొర్ర నరసింహరావు, బీరక సూర్యప్రకాష్‌రావు, జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**కూనవరం:** మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి జన్మదిన వేడుకలను టీడీపీ టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ కొక్కిరేణి ఆదినారాయణ, టీడీపీ మండల మాజీ కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రతినిధి గడేసుల రంజితకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**అడ్డతీగల:** స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పుట్టినరోజును పురస్కరించుకొని ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు బాలయోగి ఆధ్వ ర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తదుపరి దేవిసెంటర్‌లో నిరు పేద మహిళలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాగర్, నానిబాబు,రాజా, బాపనమ్మ, రమేష్, ప్రభాకర్, శ్రీను, విష్ణు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా డ్రైనేజీ



మోతుగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో గణేష్ గుడి వద్ద తారు రోడ్డు రహదారి మధ్యలో గ్రౌండ్ డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామస్తులు, రాత్రి వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 20 రోజులు కిందట గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని మోతుగూడెం పంచాయతీ సెక్రటరీ జి.మోహన్ తెలియజేశారు. వెళ్ళే దారిలో డ్రైనేజీ మూ తతీసి పక్కన పడేశారు. ప్రమాదాల నివారణకు డ్రైనేజీలపై మూత ఏర్పాటు చేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు. పూడిక పనులు మొదలు పెట్టామని, గణేష్ గుడివద్ద చిన్న వంతెన మరమ్మతులకు గురైంది. అప్పుడు మరమ్మతులోభాగంగా పైనుంచికాంక్రీట్ వేయడంతో డ్రైనేజీ మురిగునీరు వెళ్లడం లేదు. 18రోజుల నుంచి వర్షాలు పడటంతో పనులు సాగడం లేదు. వర్షాలు తగ్గిన తర్వాత పనులు మొదలు పెడతామని సెక్రటరీ అన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## కరుణించిన వరుణుడు



• ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతులు

గండేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు అధికంగా కురవడంతో రైతులు నారుమడులు వేసుకుని ఖరీఫ్ పనులు ప్రారంభించారు. అయితే కొన్ని రోజులకు నారుమళ్లు ఎదిగినప్పటికీ వర్షాలు పడడంతో సగం దమ్ముచేసిన పొలాలు నీరులేక ఎండిపోయాయి. అటు పొలాలు ఎండిపోయి ఇటు నారుమళ్లు ముదురుపోతే నాట్లు సమయం దాటిపోయి దిగుబడులు తగ్గుతాయని ఆందోళన చెందుతు న్న సమయంలో శుక్ర, శని వారం వరుణుడు కరుణించి భారీ వర్షం కురవడంతో మళ్లీ పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో మళ్లీ రైతుల్లో ఆశలు చిగురించి ఆనందంతో మళ్లీ ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభించారు. సగం దమ్ముచేసిన పొలాలు మళ్లీ దమ్ముచేసి నారుపీకి నాట్లు వేసే పనుల్లో పడ్డారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ దాటిపోలేదని వరుణుడు కరుణించాడని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 7500 ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగు చేస్తుండగా ఇప్పటికే బోరు నీరు, చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో 50 శాతం నాట్లు వేశారు. వర్షాధార పొలాల్లో మళ్లీ నాట్లు వేస్తున్నారు. వ్యవసాయాధికారులు రైతులకు కావాల్సిన ఎరువులు అన్ని ప్రాథమిక సొసైటీల్లో అందుబాటులో ఉంచా మని కావాల్సిన రైతులు తీసుకోవచ్చని తెలిపారు.

## సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గరగపర్రుకు చెందిన గౌనబోయిన వేణుగోపాలరావు లక్షరూపాయలు విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి స్వామి వారి ప్రసాదాలు, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

## కూటమి పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి

• ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్ని రంగాల్లోను రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం మండలంలోని రామవరం గ్రామంలో రాష్ట్ర టీడీపీ యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలుచేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, ఉప్పలపాటి బుల్లబ్బులు, పాఠంశెట్టి రవి, బోదిరెడ్ల సుబ్బారావు, కుంచే తాతాజీ, మండపాక అప్పన్న దొర,మండపాక వెంకటేశ్వరరావు, అడబాలసూరిబాబు, మండపాక పాపారావు, మండపాక పెద్దకాపు, మండపాక శ్రీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించబోం


• మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



తునిలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

తునిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని మాజీ మంత్రి కాకినాడజిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తెలిపారు. పోలవరం ఎడమ కాలువకు సంబంధించి ప్రమాదకర పనులు జరుగుతున్నప్పుడు సమీపంలో ఉన్న ప్రజలకు సమాచారం ఇవ్వడం కనీస బాధ్యతని, అలా చేయకుండా పోలవరం ప్రాజెక్టు అధికారులు, సంబంధిత కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని రాజా ఆక్షేపించారు. తుని పట్టణంలోని ఒకటో వార్డు డ్రైవర్స్ కాలనీలో పోలవరం ప్రాజెక్టు పనులు కారణంగా దూసుకువచ్చిన బండ రాళ్ల ధాటికి దెబ్బతిన్న ఇళ్లను ఆదివారం రాజా పరిశీలించారు. గాయాలపాలైన వారిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. పనులకు సంబంధించి ఇకపై ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తామంతా అండగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. బాధితులను తక్షణమే ఆదుకోవాలని, దెబ్బతిన్న ఇళ్లకు తగిన పరిహారం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నేత యనమల కృష్ణుడు, తదితరులు ఉన్నారు.


## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక




శాలువా కప్పి సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగ్గంపేటలోని నూతన లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎంపిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా కంటే ఉదయబాస్కర్‌చౌదరి, సెక్రటరీగా వెంపటి రామారావు, ట్రెజరీగా కొత్త కృష్ణచైతన్యలు ఎంపికయ్యా రు. అనంతరం ప్రస్తుతం అధ్యక్షుడు బాలగంగాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఎంజీఎఫ్ చిట్నీడి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కోడూరు రంగారావు, పద్మావతి శ్రీనివాసరావు, వల్లూరి గంగాధరరావు, కొత్త కొండబాబు, పాలకుర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు



తునిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును గణపతి నగర్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు తేజస్విని, డాక్టర్ ఎస్.శివప్రసాదులు హాజరై వైద్యసేవలు అందించారు. అలయన్స్ క్లబ్ గవర్నర్ అల్లూరి ఉషారాణి, క్లబ్ గౌరవాధ్యక్షుడు భీమరాజు, కుసుమంచి సుబ్బరాయులు, నామన రవి, మూర్తి, ఆంజనేయ ప్రసాద్ ఉన్నారు.

## కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం

• టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



టీడీపీలో చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తునిరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తొండంగి మండలంలో టీడీపీ యువనేత యనమల రాజేష్ సారథ్యంలో పెద్ద ఎత్తున కాపు సామాజిక వర్గం నుంచి వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమల పార్టీ కండవాకప్పి ఆహ్వానించారు. కొత్త పాత వైషమ్యాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషిచేయాలని యనమల కోరారు. టీడీపీ నాయకులు ఉకోటి శ్రీధర్, రామకృష్ణ, ఉకోటి అప్పలరాజు నక్క శేషగిరిరావు పాల్గొన్నారు.

## ఈనాం భూముల సమస్యపై ఎమ్మెల్యేకు వినతి



పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న చింతలూరు రైతులు

ప్రత్తిపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చింతలూరు ఈనాంభూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఆగ్రామ రైతులు, టీడీపీ నాయకులు పెదశంకర్లపూడివచ్చి ఎమ్మెల్యే సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని చింతలూరు గ్రామంలో గత ఐదు దశాబ్దాలుగా భూములు సాగుచేసుకుంటున్న రైతులకు హక్కుపత్రాలు ఇప్పటికీ మంజూరుకాలేదని దీని వల్ల సాగు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బ్యాంకులు కూడా ఈభూములపై రుణాలు ఇవ్వడంలేదని బాధిత రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన జింకల తాతారావు, రైతులు ఎమ్మెల్యేను కోరారు.

## సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచాలి

• ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర సీఆర్ఎంటీ

ప్రత్తిపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్వశిక్ష అభియాన్‌లో పనిచే స్తున్న సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచాల ని రాష్ట్ర సీఆర్ఎంటీల అసోసియేషన్ అ.ధ్యక్షుడు ప్రత్తిపాడుకు చెందిన ఎలిపే రాంజీ ప్రసాద్, నాయకులు కాకినాడ దం టు కళాక్షేత్రానికి విచ్చేసిన టీచర్ ఎమ్మె ల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, గాదె శ్రీనివాసులు నాయుడులకు ఆదివారం వినతిపత్ర ం అందజేశారు. సీఆర్ఎంటీలు, ఎంఎస్ కోఆర్డినేటర్లు తదితరులకు ఐదేళ్లుగా జీతాలు పెంచకపోవడంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్రవ్యాప్తంగా 4వేల మంది పైబడి సీఆర్ఎంటీలు, క్లస్టర్ కోఆర్డినేటర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీని వారు కోరారు.

## ముద్రగడ కోలుకోవాలని అభిమానుల పూజలు

ప్రత్తిపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య ం మెరుగుపడాలని సత్తె మ్మతల్లి గుడి ముద్రగడ అభిమానులు 101 కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. తీవ్ర అస్వస్థతతో కాకినాడలో చికిత్సపొందుతున్న ముద్రగడ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఇంటికి రావాలని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. రామిశెట్టి నాని, కొప్పన గంగారావు, ములికి వీరాస్వామి, తటవర్తి అప్పారావు, మాదేపల్లి శ్రీను, పోలవరపు భూషణం, రమణ, నూకరాజు పాల్గొన్నారు.

## నా తండ్రికి మెరుగైన వైద్యం అందట్లేదు

• హెల్త్ బులిటిన్ ఎందుకు విడుదల చేయట్లేదు: ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి

సామర్లకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'నా తండ్రికి క్యాన్సర్ వ్యాధి ఉందని రెండు నెలల క్రితమే బహిర్గతం చేశాను. ఆయన నాపై ఆగ్రహం వ్యక్తంచేసి నా చేయి చేయి పట్టుకుని వారిస్తున్నారు. వైద్యులతో హెల్త్ బులిటెన్ ఎందుకు విడదల చేయించట్లేదు' అని కాపు ఉద్య మ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె, జనసేన వీరమహిళ నాయకురాలు బార్లపూడి క్రాంతి ప్రశ్నించారు. తన తండ్రికి వైద్యం అందిస్తున్న ఏడీబీ రోడ్డు కొప్పవరం మెడికవర్ ఆసు పత్రికి ఆదివారం రాత్రి ఆమె రెండోసారి విచ్చేశారు. వైద్యంపై ఇంత గోప్యం ఎందు కు మెయిన్‌టైన్ చేస్తున్నారో అర్థం కావట్లే దని విలేకరుల ఎదుట వాపోయారు. ఐసీయూ నుంచి బయటకు వచ్చిన ఆమె కన్నీటిపర్యం తమయ్యారు. క్రాంతి విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రికి సరైన వైద్యం అందట్లేదన్నారు. వైద్యం చేస్తున్న సమయంలో హెల్త్ బులెటిన్ ఎందుకు విడుదల చేయట్లేదని ఆసుపత్రి యాజమాన్యాన్ని నిలదీశారు. అయనకు క్యాన్సర్ ఉంది. దాని కి చికిత్స నిర్వహించకుండా డయా లసిస్ చేస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. వాస్తవాలు చెప్తుంటే తనను మాట్లాడకుండా నిరోధిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకూ కాకినాడ లోని మూడు ఆ సుపత్రులు తిప్పారని, మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ ఎందుకు తీసుకెళ్లట్లేదని ప్రశ్నించారు. కావాలనే ఆసుపత్రి సెక్యూరిటీతో తనను అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. తన తండ్రికి మెరుగైన చికిత్స అందించి కోలుకునే వరకు వైద్యులు నిరంతరం హెల్త్ బులెటిన్లు విడు దల చేయాలని క్రాంతి డిమాండ్ చేశారు.

## ఘనంగా శ్రీ ప్రజ్ఞ ఫ్లెయిర్ 2కే 25 వేడుకలు



కాలేజీ ఫ్లెయిర్ 2కే25 వేడుకలలో పాల్గొన్న సిబ్బంది

గండేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జెడ్.రాగంపేటలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో శ్రీప్రజ్ఞ విద్యాసంస్థ చైర్మన్ బండారు నాగబాబు, డైరెక్టర్ బండారు శ్వేత ఆధ్వర్యంలో కాలేజ్ ప్రిన్సిపాల్ అభి ఆధ్వర్యంలో కాలేజీ ఫ్లెయిర్ 2కే25 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. రానున్న విద్యా సంవత్సరానికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకున్న విద్యార్థికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తా మని నాగబాబు తెలిపారు. అనంతరం 2024-25 పరీక్షలులో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు షీల్డ్‌ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆనంద్, పులిగ పవన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో అమ్మవారు

## శాకంబరిగా ఏగులమ్మ వారు

జగ్గంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం సీతానగరంలో ఉన్న శ్రీఏగులమ్మ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చేకల్పవల్లిగా గ్రామదేవత ఏగులమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ఆలయ ప్రాంగణం, ఉత్సవ మూర్తులను అలంకరించారు. గ్రామంలో మహిళలందరూ అమ్మవారికి సారె, చీర, నైవేద్యాలు ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మురారి దుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి



గండేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామశివారులో కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన మురారి దుర్గమ్మ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. చుట్టు పక్కల జిల్లాల నుంచి భారీ వాహనాల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సాయంత్రంవరకు ఆనందంగా గడిపారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్నివిధాలా ఏర్పాట్లు చేశారు.

## తోట నరసింహానికి, నాకు విమర్శించే హక్కులేదు

• ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిని వంచనపరుడు అని విమర్శించడం తోట నరసింహానికి తగదన్నారు. ఈరోజు ప్రభుత్వం తల్లికి వందనం, ఉచిత సిలిండర్లు అందిస్తుందని, ఈ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తున్నామని, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఇవి కనపడట్లేదా నరసింహం అని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మీ పక్క గ్రామం గెద్దనాపల్లిలో ఐదుగురికి తల్లికి వందనం, మీ ఇంటి ప్రక్కన ఉన్నవారికి నలుగురికి తల్లికి వంద నం వేయడం జరిగింది ఇవి కనపడటం లేదా అని అన్నారు. ముఖ్యంగా తోట నరసింహం, నేను ఎవరినీ విమర్శించే హక్కులేదని, మేము అన్ని పార్టీలు మారి వచ్చామన్నారు. తోటనరసింహం ఆరోజు పార్లమెంట్ సభ్యుడిగా టీడీపీ నుంచి సీటు ఇచ్చినప్పుడు వంచన పరుడు చంద్రబాబు కనపడలేదా అన్నారు. కాంగ్రెస్‌లో ఉండి ఆఖరి నిమిషంలో టీడీపీలో చేరి పార్లమెంట్ సభ్యుడిగా, తర్వాత మళ్లీ వైసీపీలోకి చేరి పెద్దాపురం, తర్వాత జగ్గంపేట నుంచి పోటీ చేయడం ఈరోజు ఆయన మాట్లాడే హక్కు లేదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా 20 సంవత్సరాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటూ ఉన్న గ్రామానికి రోడ్లు వేయించుకోలేని పరిస్థితి ఆయనదన్నారు. మా కార్యకర్తలు దోచుకుతింటున్నారని ఆయన పత్రికా సమావేశంలో అంటున్నారు. మీకార్యకర్తలు ప్రభుత్వ నిధులతోపాటు మీ సొంత నిధులు కూడా దోచుకున్నారని మీరే చెప్పుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, సత్తి సదాశివరెడ్డి, కుంచే తాతాజీ, బద్ది సురేష్, పాఠంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాల కావిళ్లతో పూజలు



శరభవరంలో పాలకావిళ్లతో ఆలయానికి తరలివస్తున్న భక్తులు

ప్రత్తిపాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం గ్రామంలో ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తు లు ఆదివారం పాలకావిళ్ళతో తరలివెళ్లి పూజలు నిర్వహించారు. గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఊరేగించి అనంతరం కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణచేపట్టారు.

## కూడలి దాటడం బేజారే!



శంఖవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు హైవేపై హైరానా అవుతున్నాయి. పది మీటర్ల పనికోసం కిలోమీటరు మేర కోన్ లు రోడ్డు మధ్యన రోజంగా వదిలేస్తున్నారు. హైవేపై వెళ్లే వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదమే. బ్లాక్ స్పాట్‌గా ఉన్న కూడళ్లలో ఈకోన్ కంగారు పెట్టేస్తున్నాయి. 16వ నెంబరు జాతీయరహదారి కత్తిపూడి ఫ్లై ఓవరుపై తరచూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉదయం పెట్టిన కోన్లను సాయంత్రం వరకూ అలాగే ఉంచేస్తున్నారు. గాలికి, వాహనాల ధాటికి అటూ ఇటూ పడిపోయినా అలాగే ఉంచేస్తున్నారు. వీటివల్ల మోటారు బైక్‌లపై వెళ్లేవారు అదుపు తప్పి పడిపోతున్నారు.